ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 20 జూన్ , 2026 | పేజీలు : 07


## టెన్త్ టాపర్ దివ్యను అభినందించిన సిఎం



**ప్రజాపక్షం/చండూరు:** మార్చి 2026 పదవ తరగతి ఫలితాల్లో 579 మార్కులు సాధించిన గాంధీజీ స్కూల్ విద్యార్థిని కందుల దివ్య ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు ప్రశంసా పత్రం అందించి, అభినందించారు.పేద కుటుంబంలో జన్మించిన కందుల దివ్య జి.యడవల్లి గ్రామం నుండి ప్రతిరోజు చండూరు రావడానికి ఇబ్బంది పడి,చండూరులోని షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ వారి బాలికల వసతి గృహంలో సీటును పొంది అక్కడే ఉంటూ గాంధీజీ పాఠశాలలో చదువుకుంది.ఈ సంవత్సరం మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 579 మార్కులతో ఉత్తమ ఫలితాన్ని సాధించింది.బాలికల వసతి గృహంలో ఉంటూ నల్లగొండ జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నాడు లాల్ బహదూర్ స్టేడియం నందు ప్రశంసా పత్రం అందుకుందని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్,చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమ్యశ్రీ తెలిపారు.

# ‘సర్’ సర్వేకు సెలవులు బంద్

### నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఓటరు జాబితా సమగ్ర సవరణలో భాగంగా జిల్లాలో బీఎల్ఓలు,బీఎల్ఏలకు శిక్షణ పూర్తయిందని,మరోసారి జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటర్ జాబితా సమగ్ర సవరణపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి క్షేత్ర స్థాయి పరిశీలన ప్రారంభమవుతుందని,ఏఈఆర్ఓలు,ఈఆర్ఓలు నిరంతరం ఫీల్డ్‌లో ఉండి సర్ ప్రక్రియను పర్యవేక్షించాలని చెప్పారు. మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించి మార్పులు, చేర్పులు చేపట్టాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఫారాల సేకరణ,డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ డూప్లికేట్ ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సర్ పై ఉన్న అపోహలను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బీఎల్ఓలు ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, అలాగే సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు గ్రామాల్లో ప్రజలను కలుసుకునేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఎవరికి సెలవులు లేవని,నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా నుండి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి స్పెషల్ కలెక్టర్ రమాదేవి, చండూర్ ఆర్డీవో చండూరు వనజారాణి,మిర్యాలగూడ ఆర్డిఓ రమణారెడ్డి ,దేవరకొండ ఆర్డిఓ పద్మప్రియ పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకోవడానికి కిచెన్ షెడ్‌ను, పాఠశాలలోని టాయిలెట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అనంతరం పదవ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ అక్కడ కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థిని, విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదువుల తీరును, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భాషానైపుణ్యాలను పరీక్షించడానికి స్వయంగా వారి చేత తెలుగు టెక్స్ట్‌బుక్ చదివించారు. స్పష్టమైన ఉచ్చరణతో చదివిన విద్యార్థులను ఆయన అభినందించారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు 27 జీవాలు మృతి

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల పరిధిలోని రేవూరు గ్రామంలో గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో వచ్చిన వర్షానికి పిడుగు పడటంతో అక్కడ పొలంలో మేత కోసం వెళ్లిన జీవాల మందపై పిడుగు పడటంతో 27 జీవాలు మేకలు, గొర్రెలు మృతి చెందినట్లు పశువుల కాపర్లు చెప్పారు. 6జీవాలు అమరబోయిన శ్రీనివాసరావుకు కాగ, 15 జీవాలు అమరబోయిన వీరయ్యవి, 2 జీవాలు ఎర్ర గొర్ల లక్ష్మయ్యకు కాగా, మరో 2 జీవాలు మారుతి గంగరాజువి, 2 జీవాలు సాదం ఆదినారాయణకు చెందినట్లు బాధితులు తెలిపారు. పిడుగుపాటుకు గురై మృతిచెందినటుల సమాచారం రెవిన్యూ అధికారులు, జిల్లా పశువైద్యాధికారి బి.శ్రీనివాసరావు, డాక్టర్ కె. శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ జూనెబోయిన గురవయ్య, పాలకవర్గ సభ్యులు, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు సాదం గురవయ్య లు నష్టపోయిన గొర్రెల కాపరులకు ఎంత నష్టం జరిగిందో అంచాన వేసి నష్ట పరిహారం అందించి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



## ప్రజాసేవే రాహుల్ గాంధీ రాజకీయ లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజాసేవే రాహుల్ గాంధీ రాజకీయాల లక్ష్యమని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ వద్ద జరిగిన వేడుకల్లో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌ని భారత ప్రధానిగా చూడడమే యావత్ దేశ ప్రజల ఆకాంక్ష అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ 56వ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కరీముల్లా బేగ్ జావేద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోగులకు బ్రెడ్, పండ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు.

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో శుక్రవారం పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించాయి.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడారు దేశ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువ నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు.

**ప్రజాపక్షం/భువనగిరి :** కాబోయే భావి, భారత ప్రధాన మంత్రి, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను, యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ప్రధాన, కార్యదర్శి ఎండీ మజహర్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ఆసుపత్రి లో,రోగులకు,పండ్లు బ్రెడ్ పంపిణి చేయడం జరిగింది.







## ఆలు మగలను కలిపిన లోక్ ఆదాలత్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నేడు జరగనున్న జాతీయ మెగా లోక్ ఆదాలత్‌లో ముందస్తుగా శుక్రవారం న్యాయమూర్తులు ఎదుట ఒక జంట తమ పిల్లలతో సహా ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళితే హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలో మఠంపల్లి మండలం బోజ్య తండాకు చెందిన భూక్య కవిత ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండల జయంతిపురంకు చెందిన భూక్య లక్ష్మి నర్సింహాతో 2019లో వివాహం జరిగింది. వారికి శరణ్య అనే కుమార్తె, శ్రీకర్ నాయక్ అనే కుమారుడు జన్మించారు. ఐదు సంవత్సరాల పాటు సజావుగా సాగిన వీరి కాపురంలో తదుపరి ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఏర్పడి విడిపోయారు. గత రెండు సంవత్సరాలుగా వీరు ఇరువురు విడివిడిగా జీవిస్తున్నారు. తనకు విడి కాగితాలు మంజూరు చేయమని కోరుతూ లక్ష్మి నర్సింహా సివిల్ జడ్జి కోర్టులో విడాకులు కేసు కవితపై దాఖలైంది. ఆ కేసు విచారణలో ఉంది. ఇంతలో లోక్ ఆదాలత్ రావడంతో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్యాంసుందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన్ లు చొరవ తీసుకుని దంపతులు ఇరువురుతో ముఖాముఖి మాట్లాడి వారికి నచ్చజెప్పగా వారు ఇరువురు తిరిగి కలిసి సంసారం కొనసాగించడానికి అంగీకరించి వారి పిల్లల యుక్తముగా శుక్రవారం తమ కేసును రాజీ చేసుకుని కలిసిపోయారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు వారి చేత ఒకరి చేత ఒకరికి పూలదండలు మార్పించి శుభాకాంక్షలు తెలిపి జంటను కలిపారు. బాణోతు సురేష్‌కుమార్, కొణతం శ్రీనివాసరెడ్డి తమ సహాయాన్ని అందించగా, కాగా తిరిగి ఒక్కటైన జంటను పలువురు న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది అభినందించారు.



## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నూతనంగా ఎన్నికైన రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలు తనకు తెలుసునని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తానన్నారు. ప్రజలకు రేషన్‌ను సక్రమంగా అందజేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరమలప్రగడ అనురాధ కిషన్ రావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య




**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని గ్రామ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాలు నాయక్, వార్డు మెంబర్లు బొల్లం సైదులు, చింతల సురేష్ దీపిక, ఏఏపిసి చైర్మన్ కుంభం వెంకటరమణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు కుంభం రామ్మూర్తి, గొల్లబోయిన అక్కులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## స్కూల్ బ్యాగులు పంపిణీ

**ప్రజాపక్షం/మునగాల:** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ ఎంపిపిఎస్ శ్రీనివాస్‌నగర్ పాఠశాల విద్యార్థులకు ఆశాజ్యోతి పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడం ఆశా పౌండేషన్ సేవా దృక్పదానికి అభినందనలు తెలిపారు. పౌండేషన్ సభ్యులు సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ బిక్షం, విక్రమ్‌రెడ్డి, మేకల మధుబాబు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శుక్రవారం పట్టణంలోని శబరినగర్‌లోని శ్రీసాయి సేవా సమితి ట్రస్ట్ శ్రీసాయిబాబా మందిరంలో శ్రీషిరిడి సాయినాథ స్వామి 25 వార్షిక మహోత్సవాలలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం అధ్యాత్మికతకు పెట్టింది పేరన్నారు. దాతల సహకారంతో ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు, హోమాలు, యజ్ఞాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. వార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి అధ్యక్షుడు కర్నాటి రవి, మున్సిపల్ కౌన్సిలర్ కొనతం రాజేష్ రెడ్డి, నాయకులు అబ్దుల్ రహీం, గునగంటి హేమ సతీష్, చిలుమల సునీల్ రెడ్డి, నిమ్మల కీర్తి లవన్, బైరు వెంకన్న గౌడ్, ఎలిమినేటి అభినయ్ నాయుడు, యాదవ్ పాల్గొన్నారు.

## పశువైద్యశాలలో పశుగ్రాస ప్రదరర్శన క్షేత్రం ఏర్పాటు



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణ ప్రాంతీయ పశువైద్యశాల ప్రాంగణంలో రైతుల అవగాహన కోసం పశుగ్రాస ప్రదర్శన క్షేత్రంను అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పోషణలో 70శాతం పైగా మేతకు ఖర్చు అవుతుందని, ఎండుగడ్డి, దాణాతో పెట్టుబడి ఇంకా పెరుగుతుందని, అదే మేలు జాతి పశుగ్రాసాన్ని పెంచితే మేపు ఖర్చు తగ్గి లాభసాటిగా ఉంటుందని అన్నారు. విషయాలు నోటితో చెప్పడం కంటే కళ్లకు చూపిస్తూ వివరిస్తే సంపూర్ణ అవగాహన ఉంటుందనే ఆలోచనతో ప్రాంతీయ పశువైద్యశాలలో అందుబాటులో ఉన్న కొద్దిపాటి స్థలంలో పశుగ్రాస ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిత్యం వైద్యశాలను సందర్శించే రైతులు కంటికి కనిపించే ఈ పశుగ్రాసాన్ని చూసి అవగాహనతో వారు కూడా పెంచుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ సర్జన్, డాక్టర్ సిరిపురం సురేంద్ర, సిబ్బంది సాయికృష్ణ, చంద్రకళ, కరుణ్, ప్రశాంత్, సాగర్ పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రత్యేక ఓటర్ జాబితా (స్పెషల్ ఇంటెన్సీప్ రివిజన్‌సర్) సవరణలో రాజకీయ పార్టీలు సహకరించాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలోని టౌన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఓటర్ల సవరణ చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24వ వరకు బిఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యురేషన్ ఫారాలను పంపిణీ చేసి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారని తెలిపారు. 2002 ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురిగి సైదులు, ట్రైనర్ శ్రీను, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పుస్తకాల పేరిట అక్రమ వసూళ్లు..

### అరికట్టాలని ఎమ్మెల్యేకి వినతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, ఫీజుల పేరిట సాగుతున్న అక్రమ వసూళ్లను తక్షణమే అరికట్టి తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందుల నుండి రక్షించాలని బీసీ యువజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి నియోజకవర్గ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేటు యాజమాన్యాలు రకరకాల పేర్లతో అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యా వ్యాపారానికి తెరలేపాయన్నారు. పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులను నిర్బంధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. దీనివల్ల మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు మునగాల శైలేందర్, బీసీ యువజన సంఘం నియోజకవర్గ కార్యదర్శి పట్టేటి రమేష్, గిరిజన విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు లావూరి రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## వర్షకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వర్షకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగరాజులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులు, డ్రైనేజీలు పరిశుభ్రత పనులను అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాలలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించామన్నారు. డ్రైనేజీల పూడికలు తీసి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. వర్షకాలం దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. వర్షకాల నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డ్రైనేజీలలో చెత్త పేరుకుపోకుండా చూడాలని, దోమల బెడద బారీన పడకుండా చూసుకోవాలన్నారు,. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## టివి, ప్యూరిఫైయిడ్ వాటర్ బహుకరణ



**ప్రజాపక్షం/మునగాల:** నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి కన్న తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకరావాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జెట్టి వీరారెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలోని గ్రంథాలయంలో గ్రామానికి చెందిన తనతాత ఉప్పుల హనుమారెడ్డి, తండ్రి ఉప్పుల నర్సిరెడ్డి ల జ్ఞాపకార్థం ఎన్ఆర్ఐ ఉప్పుల లక్ష్మి నారాయణరెడ్డి రూ.50వేల రూపాయల విలువ గల టివి, ప్యూరిఫైయిడ్ వాటర్ ను తన అన్న ఉప్పుల యాదగిరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బోళ్ల ప్రతాపరెడ్డి, దొంతిరెడ్డి మోహన్‌రెడ్డి, నాగుల్‌పాషా, ఏనుగుల రమేష్, శంకర్‌రావు, రెడ్డిమళ్ల నాగరాజు, ఎస్‌కె కలాం, ఎస్‌కె దస్తగిరి పాల్గొన్నారు.

## బడిబాట ముగింపు సందర్భంగా విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం ముగింపు సందర్భంగా శుక్రవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో ఉపాధ్యాయ బృందంతో పట్టణంతో పాటు వైకుంఠాపురం, పత్తేపురం, లాల్ లక్ష్మి పురం గ్రామాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు సాధిస్తున్న ప్రగతి, ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయలు, ప్రత్యేకంగా బాలురకు కల్పిస్తున్న అనుబంధ హాస్టల్ వసతి, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు కరపత్రాలను అందించారు. తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, రషీద్‌ఖాన్, జానకిరాములు, శౌరి, వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ, మాదవి, నాగమణి, అశ్రోన్, జానయ్య, యాదగిరి, రామ్మూర్తి పాల్గొన్నారు.





## గోదాముల తనిఖీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణం, మండలంలో ఎరువుల గోదాములను మిర్యాలగూడ సహాయ వ్యవసాయ సంచాలకులు కొనిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మేకల ఋష్యేంద్ర మణిలు శుక్రవారం తనిఖీ చేశారు. అవేజ్ (ఎన్డిఆర్) గోడౌన్స్, వేణుగోపాల్ స్వామి గోడౌన్స్ , మార్క్ ఫెడ్ గోడౌన్స్ తనిఖీ చేశారు. గోడౌన్స్ లో స్టాక్ రిజిస్టర్లు, బఫర్ స్టాక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు, మిర్యాలగూడ వ్యవసాయ శాఖ డివిజన్ లో రానున్న ఖరీఫ్ సీజన్ కు సరిపోను ఎరువులున్నాయని వారు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో గోడౌన్స్ నిర్వాహకులు చైతన్య, వీరాస్వామి, మధుసుధన్ రెడ్డి ఉన్నారు.

## నూతన తహసీల్దార్‌కు సన్మానం



**ప్రజాపక్షం/నడిగూడెం:** విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా తహసిల్దార్‌గా పదవి చేపట్టిన ఎల్. మంగను శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు వారి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. మండలంలో విశిష్ట సేవలందించి ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ గుండు అనంతరాములు, మండలశాఖ అధ్యక్షులు ఎండి ఖలీల్ అహ్మద్, ఎండి ఇబ్రహీం, అలుగుబెల్లి అప్పారెడ్డి, తూము వెంకటేశ్వర రావు, వేపూరి రాములు, అంజయ్య, డి.వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన పస్తం రాము ఇటీవల బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామ 10వ వార్డు సభ్యురాలు పర్వతం కవిత శ్రీను, కొంతమంది మిత్రులతో కలిసి మృతుని కుటుంబానికి పదివేల రూపాయల నగదుతో పాటు 25 కేజీల బియ్యాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి , రెవెళ్ల కృష్ణ, పల్ల బాలు పాల్గొన్నారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఆఫీస్ సబార్డినేట్ షేక్ షాజాద్‌బీ జన్మదినంను ఘనంగా జరిపారు. కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి ఖలీల్ అహ్మద్, ఎల్. బాలాజీ నాయక్, ఎండి ఇబ్రహీం, ఆర్గనైజింగ్ సెక్రటరీ దున్న అంజయ్య పాల్గొన్నారు.



# క్లియో స్పోర్ట్స్ అరేనాలో తెలంగాణ రాష్ట్ర సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అరేనాలో యోనెక్స్ సన్‌రైజ్ 12 వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నల్గొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాష్ట్ర స్థాయి పోటీలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మైదానంలో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిర్యాలగూడలో నిర్వహించడం ఇక్కడి క్రీడాభిమానులకు పెద్ద పండుగ లాంటిదన్నారు. క్రీడలు యువతలో ఒత్తిడిని తగ్గించి, వారిలో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని ఎమెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత యువతను క్రీడల వైపు మళ్లించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వివరించారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి ఎంతో గుర్తింపు తెచ్చిన బ్యాడ్మింటన్ క్రీడకు మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని క్రీడాకారులందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నల్గొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), డిజిటల్ లెర్నింగ్ పై మిర్యాలగూడలోని కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 19, 20వ తేదీలలో నిర్వహించనున్న అన్నఅక్క ఇంటర్న్‌షిప్ పేరు కలిగిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఐదవ సెమిస్టర్‌లో భాగంగా డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్ పరిజ్ఞానంపై ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా సదస్సుకు సూర్యాపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. రత్తయ్య మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా దైనందిన జీవితంలో కృత్రిమ మేధస్సు ఏ విధంగా దోహదపడుతుంది, దానిని ఎలా ఉపయోగించాలనే విషయాలపై ఆయన విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండడం తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమ నోడల్ అధికారులు డాక్టర్ శివకృష్ణ, నాగరేఖా రాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక కాలంలో కంప్యూటర్ ప్రాధాన్యత ఎంతగానో పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# హజ్ యాత్ర పూర్తి చేసిన డాక్టర్ ఖాన్‌కు ఘన సత్కారం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని సౌదీ అరేబియా రాజ్యంలోని పవిత్ర నగరాలు మక్కా,మదీనా నుండి సురక్షితంగా నల్లగొండకు చేరుకున్న డాక్టర్ ఎఎ ఖాన్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్యలు పట్టణంలోని ఖాన్ నిసార్ హాస్పిటల్‌లో డాక్టర్ ఖాన్‌ను కలిసి ఆయన హజ్ తీర్థయాత్రను విజయవంతంగా పూర్తి చేసినందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్ర ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్ర అని,డాక్టర్ ఖాన్ సురక్షితంగా యాత్రను పూర్తి చేసి



స్వదేశానికి చేరుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఆయనకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.



## నర్సరీ నుంచే నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/నకిరేకల్ :** చిన్నారుల బంగారు భవిష్యత్తుకు నర్సరీ నుంచే నాణ్యమైన విద్యే పునాదని,ప్రభుత్వం అందిస్తున్న నర్సరీ,ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పాలెం గ్రామ సర్పంచ్ నోముల కృష్ణవేణి గోవిందరాజులు అన్నారు.మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ ప్రాథమిక తరగతులను ఆమె ప్రారంభించారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎల్. నగేష్, ఉపాధ్యాయులు టి.నర్సింహమూర్తి,జి.కల్పన, కె.విద్యాసాగర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, గ్రామస్తులు పాల్గొన్నారు.




## మల్లపురాజుపల్లిలో బంపర్ ఆఫర్..!

### సర్కార్ బడిలో చేరితే నా జీతంతోనే ఇంటి పన్ను, నల్లా పన్ను చెల్లిస్తా సర్పంచ్ మణిమాల శ్రీశైలం

**ప్రజాపక్షం/నాంపల్లి :** పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించిన కుటుంబాల ఇంటి పన్ను,నల్లా పన్నును నా వేతనం నుంచే చెల్లిస్తాను గ్రామ సర్పంచ్ మణిమాల శ్రీశైలం హామీ ఇచ్చారు.ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తూ,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు నాంపల్లి మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామ పంచాయతీ సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది.ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి చదివించే కుటుంబాలకు ఇంటి పన్ను,నల్లా (నీటి) పన్నును తానే భరిస్తానని మణిమాల శ్రీశైలం ప్రకటించారు.ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని త్రిపురారం మండల విద్యాధికారి రవి నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఆర్‌సి భవనంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ ఒకటి అనుగుణంగా ప్రతి పాఠశాల ప్రిన్సిపల్ పాఠశాలలను నడపాలని క్వాలిఫైడ్ టీచర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ దామోదర్, ఆల్ఫా డైరెక్టర్ అబ్దుల్ ఖాయం, రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ తిమ్మారెడ్డి,తేజ స్కూల్ వెంకన్న,కృష్ణవేణి స్కూల్ పులి శేఖర్,లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి




**ప్రజాపక్షం/హాలియా:** స్వర్ణకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.శుక్రవారం మండల కేంద్రమైన హాలియాలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో జీవో272 పటిష్ఠం గా అమలు చేసి స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీ నుంచి కాపాడాలని పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు.ఈసందర్భంగా ఆసంఘం అధ్యక్షులు కటికం మురళిచారి మాట్లాడుతూ స్వర్ణకారులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. జీవో నెంబర్ 272 పటిష్టంగా అమలు చేసి తమకు భద్రత కల్పించాలని తెలిపారు.50 సంవత్సరాలు నిండిన స్వర్ణకాలకు 5వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ కు తమ సమస్యలను తెలుపుతూ వినతిపత్రం అందజేశారు.

## స్వీపర్-1 పోస్ట్‌కు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నాంపల్లి :** కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్వీపర్ 1 పోస్టు భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల విద్యాధికారి కే .మల్లికార్జున రావు తెలిపారు. మండల కేంద్రంలో దరఖాస్తుదారులు ఏడవ తరగతి చదువుకునీ ఉండాలని ఈ పోస్టు తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు జూన్ 20 నుండి 22వ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని దరఖాస్తులను పాఠశాలలోని ప్రత్యేక అధికారికి సమర్పించాలన్నారు.

## అప్రమత్తతే రక్షణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట సిఐ వెంకట్ సూచించారు. సాంకేతికత విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు. మొబైల్ ఫోన్లకు తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని స్పష్టం చేశారు. బహుమతులు గెలుచుకున్నారంటూ వచ్చే ప్రకటనలు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగే కాల్స్ పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇలాంటి లింకులు క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందన్నారు. సూర్యాపేట పట్టణ పరిధిలో మైనర్లకు ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మోటారు వాహనాలు నడపడానికి ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే 1930కు హెల్ప్‌లైన్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఆలయ నిర్మాణానికి పూజలు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని లోయపల్లి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న కనకదుర్గాదేవి ఆలయ నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ వల్లపు గంగయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాదరి సంధ్య, సత్తయ్య, వీరస్వామి, సీతయ్య, గాదరి వెంకన్న, నర్సయ్య, జానయ్య, వెంకన్న, వెంకట్‌రెడ్డి, లింగయ్య, జనార్ధన్, శ్రీను, నర్సయ్య పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థులకు సర్పంచ్ కందుల స్వామి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించి ఒకటవ తరగతినుండి ఐదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జడ్‌పిహెచ్‌ఎస్ హెడ్మాస్టర్ శ్రీనివాసాచార్యులు, ప్రాథమిక పాఠశాల టీచర్స్,నాయకులు బోడ అబ్బ సాయిలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ విద్యను కొనసాగించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లోని ప్రీ ప్రైమరీ విద్యను కొనసాగించాలని కోరుతూ శుక్రవారం అంగన్వాడి టీచర్లు ఎంఇఒ మేక నాగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పనిచేస్తున్న చాలామంది టీచర్లు డిగ్రీ, పీజీ చేసిన వారు ఉన్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.నాగమణి,కోశాధికారి సుభాషిని తో పాటు అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/రామన్నపేట :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ 'ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యం'అని అన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణం అందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రాహుల్ గాంధీ గారి జన్మదినం మరియు విద్యార్థులకు నోట్బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే, వారి విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, సేవా భావంతో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రేస్ పార్టీ నూతన గ్రామ శాఖలు ఎన్నిక...



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య ఆదేశానుసారం మోటకొండూరు మండల పార్టీ అధ్యక్షులు గంగాపురం మల్లేష్ ఆధ్వర్యంలో మండలంలోని వర్టూర్, చందేపల్లి, కదిరేణి గూడెం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్టూర్ గ్రామశాఖ అధ్యక్షులుగా గువ్వ పరుశురాములు, చందేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులుగా బొట్ల సంజీవ, కధిరేణి గూడెం గ్రామ శాఖ అధ్యక్షులుగా పైళ గణపతి రెడ్డిను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రదానకార్యదర్శి నెమ్మని సుబ్రమణ్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథ రాజు,ముత్తి రెడ్డి గూడెం సర్పంచ్ బుడిగే బాలరాజు, మోట కొండూరు టౌన్ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు క్యాసాగల్ల చందు, ఆయా గ్రామాల మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గ్రామ కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించిన చైర్మన్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలోని స్థానిక ప్రగతి నగర్ వాటర్ ట్యాంక్ వద్ద అమృత్ 2.0 స్కీమ్ క్రింద నిర్మాణం చేస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించుటలో భాగంగా చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ (పబ్లిక్ హెల్త్) వెంకటేశ్వర్లుతో కలిసి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పర్యటన సమయంలో స్థానిక జగదేకపూర్ చౌరస్తా నుండి మొదలుకొని చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులలో భాగంగా స్థానిక ఆర్‌కె హాస్పిటల్ వద్ద ఉన్నటువంటి పెద్ద రాయి వల్ల ప్రగతి నగర్ వాటర్ ట్యాంక్ నుండి డిస్ట్రిబ్యూషన్ పైపు లైన్ వేయుటకు సమస్యాత్మకంగా ఇబ్బందికరంగా ఉన్నందున, అట్టి దానిని పరిశీలించి అట్టి రాయి ప్రక్క నుండి ట్రెంచింగ్ చేయించి పైపు లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ మహమ్మద్ అవైస్ ఉర్ రహమాన్ చిస్తి, వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషన్ కె.చంద్ర ప్రకాష్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ జాలిగం విగ్నేష్, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, సహాయక ఇంజనీర్లతో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమణ ఆరోపణలు అవాస్తవం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపాలిటి పరిధిలోని రామాపురం శ్మశాన వాటి స్థలం, కనకదుర్గ ఆలయానికి చెందిన దేవుని మాన్యం భూములు అక్రమణలకు గురైనట్లు గ్రామస్తులు గురువారం నేరేడుచర్ల తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులు అవాస్తవమని రామాపురం మాజీ సర్పంచ్ చింతమల్ల సైదులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వల్లంశెట్టి రాజేశ్వరి 393 సర్వే నెంబర్‌లో చింతమల్ల కోటేశ్వరమ్మకు 6.50 కుంటలు, 390/ సర్వే నెంబర్‌లో చింతమల్ల కోటేశ్వరమ్మకు ఒక కుంట, కొండ్రు రాణికి 3కుంటల స్థలాన్ని రిజిస్టేషన్ చేశారని వెల్లడించారు. గతంలో మా స్థలంలో చెట్లను తొలగిస్తే కొంతమంది గుడి మాన్యమని, అసైన్డ్ భూమి లేదా ప్రభుత్వ భూమి అని నన్ను ఇబ్బందుల్లో గురిచేయగా తహసిల్దార్‌కు దరఖాస్తు చేసుకోగా వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్, తహసిల్దార్ లు విచారణ చేసి ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి కాదన్నారని తెలిపారు. ఈ భూమి చింతమల్ల కోటేశ్వరమ్మ, కొండ్రు రాణిలకు చెందినదని నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. గతంలో నా స్థలంలో చెట్లు తీసిన వారిపై నేరేడుచర్ల పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారని తెలిపారు. కమ్యూనిటి హాల్ నిర్మాణానికి ఎ లాంటి ప్రభుత్వ నిధులు మంజూరు కాలేదని, తన సొంత ఖర్చులతో నిర్మించినట్లు తెలిపారు. కొంతమంది గ్రామస్తులు తనపై రాజకీయ దురుద్దేశ్యంతోటి వాస్తవంలేని విషయాలను తహసిల్దార్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, వీరిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వీటికి సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్లు 13బి ధృవపత్రాలు తహసిల్దార్‌కు సమర్పించినట్లు తెలిపారు.

**తహసిల్దార్ వివరణ :** ఈ విషయమై తహసిల్దార్ సురగి సైదులును వివరణ కోరగా ఈ భూములపై వచ్చిన ఫిర్యాదుల మేరకు చింతమల్ల సైదులు వద్ద నున్న డాక్యుమెంట్లను పరిశీలించగా సక్రమంగా ఉన్నాయని, చింతమల్ల కోటేశ్వరమ్మ, కొండ్రు రాణి లకు చెందిన భూమి అని తెలిపారు.



## ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడికి

**ప్రజాపక్షం/నకిరేకల్ :**ప్రైవేటు పాఠశాలలను వీడి ప్రభుత్వ బడి వైపు విద్యార్థులు అడుగులు వేస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి మేక నాగయ్య తెలిపారు.శుక్రవారం మండలంలోని గోరింకలపల్లి ఎంపీయూపీఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.2026 27 విద్యాసంవత్సరానికి నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించిందన్నారు. దీంతో వివిధ ప్రైవేటు పాఠశాలల నుంచి 33 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చేరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్,ఉపాధ్యాయులు సత్యనారాయణ,జాహ్నవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నల్లగొండ ఎలక్ట్రిసిటి డిఈ డి. ప్రభాకర్ తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో యోగపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నిజజీవితంలో యోగ ఎంతో అవసరమన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 21న ఆదివారం ఉదయం 6 గంటలకు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు చాడ పాపిరెడ్డి, సంత్ నిరంకార సంస్థ జిల్లా అధ్యక్షురాలు కడారి సరళ, యోగ సాధకులు లింగయ్య, మల్లారెడ్డి, మురళీకృష్ణ, లక్ష్మినారాయణ, వెంకన్న, శ్రీధర్, సుదర్శన్ రెడ్డి, మంజుల పాల్గొన్నారు.

## భారీగా అక్రమ ఇసుక నిల్వల సీజ్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని యండ్లపల్లి గ్రామంలో శుక్రవారం గనులు, భూగర్భశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేసి గ్రామంలో నిల్వ చేసిన భారీ ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సహాయ సంచాలకులు ఎం. రఘుబాబు, అసిస్టెంట్ జియాలజిస్ట్ పి. విజయరామరాజు, టెక్నికల్ అసిస్టెంట్ వెంకన్న, ఎస్ఆర్‌ఓలు రవి, బాలు, గ్రామ పంచాయితీ అధికారి ఎన్. విజయ్‌లు సంయుక్తంగా తనిఖీ చేసి సర్వే నంబర్ 577 (ఐకెపి సెంటర్) పరిసరాలు, సర్వే నంబర్ 579 (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా) బోడ పట్ల వేణు, బుడిగె శ్యాంసుందర్, బుడిగె వెంకన్నల ఇంటి ఎదురుగా, కోటబుర్జు ప్రాంతం శ్రీసాయి నిలయం పరిసరాలు, పంతంగి దేవయ్య, కంఠమహేశ్వర గుడి ప్రాంతాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 290 ట్రాక్టర్ల పరిమాణం కలిగిన 870 క్యూబిక్ మీటర్ల నిల్వ ఉంచిన అక్రమ ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి మూసీ నదితో పాటు ఇతర ప్రాంతాల్లో ఇసుకను తొవ్వి అక్రమ రవాణా చేసిన, నిల్వ ఉంచినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు మీరిన వారిపై భారీ జరిమానాలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.





## రైతుల కష్టానికి ప్రతిఫలం మార్కెట్ యార్డ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రైతుల కష్టానికి ప్రతిఫలం దక్కే వేదిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ అని జూలూరు పిఎసిఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్ అన్నారు. పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో ఆయన జూలూరు సర్పంచి కాసులు అంజయ్య గౌడ్ తో కలిసి మార్కెట్ యార్డును శుక్రవారం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వద్ద పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకుని శాశ్వతమైన మార్కెట్ యార్డ్ నిర్మించాలని సంకల్పంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆర్థిక సహకారంతో మార్కెట్ యార్డును నిర్మించమని రైతుల రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుని రైతాంగానికి ఎనలేని నిధులు కేటాయిస్తూ మును పెన్నడు చూడని విధంగా అభివృద్ధిని చూస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం పాలకమండలి సభ్యులు, ఉప సర్పంచ్ పెద్దగూడెం గ్రామ సర్పంచ్ ఫకీరు లతా నర్సిరెడ్డి, అధికార సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి ఆశీర్వాదం




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం,గంధమల్ల మాజీ ఎంపీటీసీ బోళ్ళ కనకలక్ష్మి నరసింహులు (దాము) కుమారుని మొదటి పుట్టినరోజు వేడుకలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం మాదాపూర్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన బిఆరెస్ యూత్ ప్రెసిడెంట్ ఎరుకల శ్రీకాంత్ గౌడ్ మాతృమూర్తి మృతికి విచారం వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మర్రిగూడెం గ్రామంలో సర్పంచ్ బోదాసు స్వప్న జగన్ ఆధ్వర్యంలో ప్రవేటు పాఠశాలలకు వద్దు అని ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అని తన ముగ్గురు పిల్లలు వంగపల్లిలో ప్రైవేట్ పాఠశాలలు చదువుతున్నటువంటి వారిని శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా మిగతా పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లకుండా మన గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సర్పంచును ఆదర్శంగా తీసుకొని మీరు కూడా అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. గ్రామ ప్రజలు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## యుద్ధప్రాతిపదికన భగీరథ పైప్‌లైన్ మరమ్మత్తులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని అవంతిపురం ప్రాంతంలో గల మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ప్రధాన పైప్‌లైన్‌లో అకాల వర్షాల కారణంగా ఏర్పడిన సాంకేతిక లోపాన్ని త్వరితగతిన సరిచేయాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన అక్కడ జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా నిలిచిపోకుండా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బంది మరియు యంత్రాలను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మళ్లీ కెసిఆర్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారని,రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే మళ్లీ కేసీఆర్ నాయకత్వం అవసరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని సువర్ణ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సర్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిలయమైన నల్లగొండ, జిల్లాకు సభ్యత్వాల ఇన్చార్జిగా నియమించడం తన అదృష్టంగా భావిస్తున్నానని,ఈ అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో రైతులు ధాన్యం కొనుగోలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావించిన వారిపై ఒత్తిళ్లు తేవడం సరికాదన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్,సభ్యత్వ నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి గుజ్జ దీపికాయోగేంద్ర,మాజీ గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, నల్లగాటి ప్రసన్న రాజ్,రేగట్టే మల్లికార్జున్ రెడ్డి,సూదిని నరేందర్ రెడ్డి,బలరాం రాచకొండ శ్రీనివాస్ గౌడ్,నవీన్ రావు ధనలక్ష్మి పాల్గొన్నారు.

## తుర్కపల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కోట జహంగీర్ ఎన్నిక



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** డీసీసీ జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, మండల పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, స్థానిక సర్పంచ్ సోమొల్ల వెంకటేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో తుర్కపల్లి టౌన్‌లో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుని ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో తుర్కపల్లి టౌన్, అధ్యక్షులుగా కోట జహంగీర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ ప్రధాన కార్యదర్శిగా బొల్లారం జగదీష్, ఉపాధ్యక్షులుగా రొయ్యల మధు, సహాయకార్యదర్శిగా బండారి శ్రీను, కార్యదర్శిగా కసరబోయిన గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆకుల అమరేందర్‌లు ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, వార్డ్ మెంబర్ ఎండీ నజీర్, నాయకులు కోట సురేష్, కూరెళ్ల బాలకృష్ణ, ఆకుల వెంకటేష్, పాముల రాజు గౌడ్, బోరెడ్డి మహిపాల్ రెడ్డి, హన్మాంతరావు, బండారి యాదగిరి, గౌస్ అరిగే మహిపాల్, పెండం గణేష్, జీవిలికపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## న్యూట్రిషన్ కిట్ల పంపిణీ




**ప్రజాపక్షం/భువనగిరి :** టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా నిర్వహిస్తున్న వంద రోజుల కార్యక్రమంలో నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డా.అరుణ కుమారి, ఆర్ఎంఓ డా.జయలక్ష్మి, టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.వంశీకృష్ణ, డా.రాజేందర్ నాయక్, నవభారత్ యూత్ సభ్యులు వినయ్, గోపి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా.అరుణ కుమారి మాట్లాడుతూ యువత సేవా దృక్పథంతో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావంతో ముందుకు వస్తున్న యువత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సేవా, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తన జన్మదినం సందర్భంగా టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ టీబీ రహిత తెలంగాణ సాధనకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.



## ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ప్రముఖ వైద్యులు, 18వ వార్డు కౌన్సిలర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని 18వ వార్డు విజయకాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, టెక్ట్స్ బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లకు పైగా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి కూడా పెద్దపీట వేస్తుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆహార నియమాలు సైతం జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా జంక్‌ఫుడ్‌ను దూరంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రు నాయక్, పాఠశాల హెచ్ఎం కొంపెల్లి సుశీల, వార్డు అధికారి నాగార్జున, నాయకులు కరుణాకర్ రెడ్డి, ధరావత్ నిఖిల్, వంశీ, ప్రేమ్‌కుమార్, పుష్ప, రమేష్, చాంప్ల, సైదులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/చివ్వెంల :** అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలో పంతంగి ప్రియాంక అన్వేష్, శిగ సైదమ్మ శ్రీను ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలలో ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, గ్రామ సర్పంచ్ గాయం ఉదయశ్రీ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు వేములపల్లి వాసుదేవరావు, బోడుపుల హరికృష్ణ, కోడిరెక్క ఏడుకొండలు, గుండెబోయిన రమేష్ రావు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలి



**ప్రజాపక్షం/వేములపల్లి:** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఏడిఏ జగదీశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలోని పొలంగట్లలో ఇంటి ఆవరణ కాళీ ప్రాంతాలలో మొక్కలు నాటి వర్షాపాతం కాలుష్యం నివారణ కు సహకరించాలని అన్నారు.వ్యవసాయ పంటలలో భాగంగా సందీప్ పెసర మినుము పంటలు వేసుకోవాలని సూచించారు పంటకు సంబంధించిన మినీ కిట్లను రైతులకు అందించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ వ్యవసాయ విస్తరణ అధికారులు షఫీ రమేష్ ప్రియాంక,వేములపల్లి, ఆమనగల్లు సర్పంచులు పుట్టల సందీప్ కుమార్,పిల్లల సందీప్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా ఎరువుల పంపిణీ

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి పాలెం రజిని సందర్శించారు. యూరియా యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకున్న రైతులతో మాట్లాడుతూ యూరియా స్టాక్ కావల్సినంత అందుబాటులో ఉందన్నారు. విడతలవారీగా రైతులు తీసుకెళ్లాలని కోరారు. ఎరువుల డీలర్స్‌తో మాట్లాడుతూ ఎరువులన్నీ ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని, బిల్లు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని సూచించారు. ఎరువుల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## చిన్నారులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** గుర్రంపోడు మండల సిపిఐ కార్యదర్శి లక్ష్మీపతి పిల్లల నూతన వస్త్రలంకరణ కనగల్ మండలం దర్వేశిపురం లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం చిన్నారులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలో పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజాచారి,ఎస్ రమేష్,శంకర్ ఉన్నారు.

## వేములపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ



**ప్రజాపక్షం/వేములపల్లి** : నల్లగొండ జిల్లా వేములపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ వార్షికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ,కేసుల దర్యాప్తు పురోగతి,సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమీక్షించారు.తనిఖీలో భాగంగా ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు,కేసు డైరీలు,బీట్ రికార్డులు, వారెంట్లు,పెండింగ్ కేసులు, కమ్యూనిటీ పోలీసింగ్‌కు సంబంధించిన పత్రాలను ఇటీవల నమోదైన రోడ్డు ప్రమాదాలు,దొంగతనాలు,ఇతర నేరాలకు సంబంధించిన వివరాలను సమీక్షించినఆయన, నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొం దించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్ర మంలో ఎస్‌బీ సీఐ ఆదిరెడ్డి, మిర్యాలగూడ రూరల్ సీఐ పిఎన్‌డి ప్రసాద్, వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ఫా పాఠశాల విద్యార్థికి నార్ల జాహ్నవి సత్కారం

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల కేంద్రంలోని ఆల్ఫా ఉన్నత పాఠశాలలో చదివిన నార్ల జాహ్నవి నీత్రిపురారం మండల విద్యాధికారి రవి నాయక్ శుక్రవారం శాలువా కప్పి సత్కరించారు.తల్లిదండ్రులు నార్ల శ్రీనివాస్,కుమార్తె జాహ్నవి 2023/24 విద్యా సంవత్సరంలో ఆల్ఫా పాఠశాలలో చదివి 9.7 జిపిఏ సాధించింది. ఇంటర్మీడియట్లో 1000/993 మార్కులు సాధించింది.టీజీ ఈఏ పిసి ఇటి ర్యాంకు సాధించింది.అద్భుతమైన ఘనత సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చింది.ఈసందర్భంగా ఆల్ఫా ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మండల విద్యాధికారి రవి నాయక్ సత్కరించి అభినందించారు.



## ప్రజలందరూ భాగస్వాములై ధృవీకరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఈ కార్యక్రమం 25 జూన్ నుండి ప్రారంభమై 01 అక్టోబర్ 2026న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగుస్తుందన్నారు. ఈనెల 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి ఎన్యూమరేషన్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరించడం జరుగుతుందన్నారు. జూలై 31 వరకు ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుండి ఆగష్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరిస్తారన్నారు. జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, విచారణ, ధృవీకరణ, ఫారాలపై నిర్ణయించడం జరుగుతుందని పేర్కొన్నారు. తుది ఓటరు జాబితా అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్లు ఫారాన్ని పూర్తి చేసి 24 జూలై లోపు బిఎల్ఓలకు అందజేయాలన్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికం అన్నారు. ఫోటో తప్పుగా లేదా పాతదిగా ఉంటే తాజా ఫోటోను ఫారానికి



జత చేయాలని సూచించారు. ఇంట్లో అందుబాటులో లేకపోతే కుటుంబంలోని వయోజన సభ్యుడు ఫారం పూర్తి చేసి సమర్పించవచ్చన్నారు. ఓటర్లు https:// voters.eci.gov.in వెబ్‌సైట్‌లో ఎపిక్ లేదా నమోదిత మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయి ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తి చేసి సమర్పించవచ్చన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన లేదా 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే అర్హత కలిగిన వారు ఫారం 6 డిక్లరేషన్ ఫారంతో కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత ఫారం 8 ద్వారా చిరునామా మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## మహిళల సాధికారతకు సశక్తి ప్రాజెక్ట్ ప్రయోజనం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహిళలు,వారి పిల్లల ఆరోగ్యం, విద్య,సామాజిక భద్రత రంగాల్లో సానుకూల మార్పులు తీసుకురావాలని మహితా సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ గౌతమ్ రెడ్డి ఆకాంక్షించారు.జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ యూనిట్ (డ్యాప్కు) కార్యాలయంలో మహితా సంస్థ ఆధ్వర్యంలో,ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో అమలు చేయనున్న సశక్తి ప్రాజెక్ట్ ఆవిష్కరణ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ప్రాజెక్ట్ అమలు,లక్ష్యాలు, భాగస్వామ్య సంస్థల బాధ్యతలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సశక్తి ప్రాజెక్ట్‌ను నల్లగొండ,సూర్యాపేట,యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 2026 ఏప్రిల్ నుంచి 2028 మార్చి వరకు రెండు సంవత్సరాలపాటు అమలు చేయనున్నట్లు తెలిపారు.మహిళా లైంగిక కార్మికులు (ఎఫ్ఎస్‌డబ్ల్యూలు)వారి పిల్లల సమగ్ర అభివృద్ధి,ఆరోగ్య పరిరక్షణ ప్రధాన లక్ష్యాలుగా ఈ ప్రాజెక్ట్ పనిచేస్తుందని వివరించారు.ప్రాజెక్ట్ ద్వారా లబ్ధిదారులకు ఆరోగ్య



సేవలు,క్యాన్సర్,ఇతర నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) స్క్రీనింగ్,మానసిక ఆరోగ్య సేవలు, తల్లిశిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే సామాజిక భద్రతా పథకాలతో అనుసంధానం చేయడం,పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.రెండు సంవత్సరాల వ్యవధిలో మొత్తం 3,100 మంది లబ్ధిదారులను చేరుకోవడం ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

## అసంపూర్తి రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ సమితి సమావేశంలో వీరస్వామి మాట్లాడారు పట్టణంలోని పలు కాలనీలు,ప్రధాన రహదారులు అసంపూర్తిగా ఉన్న రోడ్లు,మురుగు కాలువల పనుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుభాష్ విగ్రహం నుంచి గొల్లగూడెం వరకు చేపట్టిన రహదారి విస్తరణ, నిర్మాణ పనులు రెండు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉండటం ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఇళ్ల స్థలాల పంపిణీ,డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం,మౌలిక సదుపాయాల కల్పన వంటి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోరారు. సిపిఐ నాయకులు ముండ్ల ముత్యాలు అధ్యక్షతన వహించిన సమావేశంలో పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి సహాయ కార్యదర్శి వి.లెనిన్ నాయకులు,దోటి అక్కలయ్య,మిట్టపల్లి నందం, శివరాత్రి వీరయ్య,వల్కి వెంకటేష్,ఎ.అంజయ్య,చిత్రం యాదయ్య,కౌంసల్య, జె.విజయ పాల్గొన్నారు.

## స్టేషనరీ పంపిణీ

**ప్రజాపక్షం/నాంపల్లి :** బడిఈడు పిల్లలందరినీ ప్రైవేట్ స్కూళ్లకు పంపకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం మన బాధ్యత చిట్టెంపాడు గ్రామ సర్పంచ్ కోరే దేవేంద్ర సైదులు అన్నారు. మండలంలోని చిట్టెంపాడు గ్రామంలో శుక్రవారం జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అమరావాది యాదయ్య 45 మంది విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు,విద్యార్థులు,గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## చెట్టును నరికితే నీ ఊపిరిని కోసుకున్నట్టే

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** చెట్టును నరికితే నీ ఊపిరిని కోసుకున్నట్టే ఒక్క మొక్క నాటితే వంద తరాలకు ప్రాణవాయువు పచ్చదనంతో పల్లె, పరిశుభ్రతతో ప్రగతి అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.నార్కట్‌పల్లి మండలంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీరేశం స్థానిక నాయకులు,అధికారులతో కలిసి మొక్కలు నాటి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కే.ఉమేష్ చారి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య గౌడ్,గ్రామ సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్,వడ్డే భూపాల్ రెడ్డి,ఏపీవో శిరీష, సత్తు సత్తయ్య,పుల్లెంల అచ్చాలు గౌడ్, బింగి కొండయ్య,ఈడుకల్ల సంపత్,కమ్మలపల్లి మల్లేష్,మర్రి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** అర్హులైన పేదలందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుర్రపుతండా గ్రామంలో రమావత్ పుల్లి బిచ్చు దంపతుల ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశంలో ఎంఎల్ఏ పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. అనంతరం కేశ్యతండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ రమావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్మెట్‌లను ఎంఎల్ఏ బాలునాయక్ మాజీ ఎంపిపి దూదిపాల రేఖ తో కలిసి తండాలోని వాహనదారులకు ఉచింతంగా పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, నాయిని మాధవరెడ్డి, సర్పంచ్‌లు రమావత్ రాజునాయక్ పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో 24 గంటల వైద్య సేవలు అందించాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో 24 గంటల వైద్యం అందించే విధంగా పిహెచ్‌సిని అప్‌గ్రేడ్ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మండల కేంద్రంలోని పిహెచ్‌సి కేంద్రానికి 108 సౌకర్యంతో పాటు ఆయూష్ పథకం అందుబాటు లో ఉన్నా కాని కేవలం 12 గంటల సమయం వరకే పిహెచ్‌సిలో కేంద్రం అందుబాటులో ఉండడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో మండల కేంద్రంలోని పిహెచ్‌సికి 24 గంటల వైద్య సదుపాయం అందుబాటులో ఉండేదని మరళ ఆ సదుపాయాన్ని 12 గంటలకు చేయడంతో రోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే విధంగా పిహెచ్‌సి కేంద్రంలో వైద్యులు, సిబ్బంది కొరత ఉందని వాటిని కూడా పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీవో పరిటాల పద్మప్రియ బిఎల్‌వోలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో




శుక్రవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై బిఎల్‌వోలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ బిఎల్‌వోలు ఓటరు జాబితా సవరణను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ నరేందర్, ఎలక్షన్ డిటి ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ పారా క్రీడాకారులకు జీవో నెంబర్ 74లో జత చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ పారా క్రీడాకారులకు జీవో నెంబర్ 74లో జత చేయాలని నల్లగొండ జిల్లా పారా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున స్వామి డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్‌లో పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు జీవో నెంబర్ 74లో ఆడ్ చేయకపోవడం దురదృష్టకరమని,తక్షణమే ప్రభుత్వం స్పందించి జీవో నెంబర్ 74లో పారా స్పోర్ట్స్ ను యాడ్ చేసి రెండు శాతం కోటా ఉద్యోగాలు వెంటనే కల్పించాలని కోరారు. ఎవరి సహాయ సహకారాలు లేకుండా జాతీయ అంతర్జాతీయ క్రీడలలో పాల్గొని పథకాలు సాధించి తెలంగాణ పేరుని దేశ ప్రతిష్టలను నిలబెడుతున్న పారా క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలని మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రేగులగడ్డ తండాలో గతంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారికి ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. అనంతరం తాళ్ల మల్కాపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రేగులగడ్డ తండా సర్పంచ్ బాణోతు సరోజ, ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, రాజశేఖర్, ఉపాధ్యాయులు వీరారెడ్డి, రంగయ్య, పంచాయతీ కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.

## కష్టపడి చదివి విజేతలుగా ఎదగాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు ఇష్టంతో చదువుకుంటూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని అవాంతరాలు ఎన్ని ఎదురైనా వాటిని ఇష్టంగా భరించి విజేతలుగా ఎదగాలని చెర్రీ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు చెరి పల్లి అశ్విన్ తెలిపారు. శుక్రవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో చదువుకుంటున్న 200 మంది విద్యార్థులకు రూ. 80 వేలు విలువ చేసే 15 వందల నోటు పుస్తకాలను అందించి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నూరి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చెర్రీ ఫౌండేషన్ సభ్యులు నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తులు పంపిణీ

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రజాప్రభుత్వం అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని 3, 4 అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు ఐసిడిఎస్ ద్వారా అందించిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. టీచర్లు సవిత, స్వర్ణకుమారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురావు, ఆమూల్య, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, ఆశా కార్యకర్త శ్రీలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/డిండి;** శుక్రవారం డిండి మండలంలోని సింగరాజుపల్లి తండా మాజీఎంపిటిసి, గిరిజన సమాఖ్య నాయకులు కస్నా నాయక్ కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎల్కేజీ సీటుకు లక్ష రూపాయల వసూలా?..



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు లాభాలే ధ్యేయంగా విద్యా హక్కు చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రుల నుంచి భారీగా ఫీజులు దండుకుంటున్నాయని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ స్కూళ్ల దోపిడీపై శుక్రవారం మిర్యాలగూడ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, మాలమహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్ల పల్లి సురేష్ మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని పాఠశాలల్లో ఎల్కేజీ చదివే చిన్నారి చేరికకే సుమారు యాభై వేల నుండి లక్ష రూపాయల వరకు డిమాండ్ చేయడం దారుణమన్నారు. కేవలం అడ్మిషన్ల పేరిటే 3,000 నుండి 5,000 రూపాయల వరకు వసూలు చేస్తూ సామాన్యుడికి చదువును దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు వడ్త్యా వెంకటేష్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ సైదానాయక్, మాల మహానాడు మిర్యాలగూడ పట్టణ నాయకులు గంట సుధాకర్, విద్యార్థులు ఆకుల సరిత, బంటు కవిత, కందుల ఉమా, నాగరాజు, శ్రీదేవి, స్వరాజ్యం, భూపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ల స్వార్థానికి బలవుతున్న మున్సిపల్ నిధులు..



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ పరిధిలోని వివిధ వార్డుల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ల స్వార్థం వల్ల మున్సిపల్ నిధులు పూర్తిగా దుర్వినియోగం అవుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పట్టణంలోని రవీంద్రనగర్‌లో నాణ్యత లేని నిర్మాణాల కారణంగా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన కాంక్రీట్ డ్రైన్ వారం రోజులకే వర్షానికి కొట్టుకుపోవడంపై బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇలియాస్ ఖాన్ శుక్రవారం సందర్శించి మాట్లాడుతూ పట్టణంలోని 48 వార్డుల్లో రూ.16 కోట్ల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల పనులన్నింటినీ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. రవీంద్రనగర్ డ్రైన్ నిర్మాణంలో సిమెంట్, ఇనుము వాడకంలో తీవ్ర లోపాలు ఉన్నాయని, ఇసుకకు బదులు కేవలం డస్ట్‌తో నిర్మాణం చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ది శ్రీనివాస్ గౌడ్, పద్మశెట్టి కోటేశ్వరరావు, గంగుల భిక్షం, అంజిబాబు, వార్డు ఇంచార్జ్ ఇనుగంటి జ్యోతి తిరుపతి నాయుడు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు..




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆధునిక వైద్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల బ్లడ్ క్యాన్సర్ లాంటి మహమ్మారిని సైతం ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని మలక్‌పేట్ యశోదా హాస్పిటల్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని కాన్ఫరెన్స్ హాల్లో రక్త క్యాన్సర్ నివారణ, చికిత్సా విధానాలపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన 34 సంవత్సరాల ఒక యువకుడు అత్యంత క్లిష్టమైన స్థితిలో ఆసుపత్రికి రాగా, అతనికి విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాపాయం నుండి కాపాడామని చెప్పారు. మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో ఏఎంఎల్ వంటి అత్యంత క్లిష్టమైన కేసులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అత్యాధునిక ఆంకాలజీ మౌలిక సదుపాయాలు, ఆధునిక నిర్ధారణ సాంకేతికత, అనుభవజ్ఞులైన మెడికల్ ఆంకాలజీ బృందాలు, 24 గంటల క్రిటికల్ కేర్ సేవలు మరియు కీమోథెరపీ ప్రోటోకాల్స్ అందుబాటులో ఉన్నాయి. రోగులు ఈ ఉత్తమ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, వాసుకిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## సిసిరోడ్లు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల పరిధిలోని రేవూరు గ్రామంలో అంగన్‌వాడీ భవనం, సిసి రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ జూన్‌బోయిన గురవయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ భవనం 12 లక్షలు, సిసిరోడ్ల నిర్మాణానికి 10 లక్షలు మంజూరు కావడంతో పనులకు సర్పంచ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రభుత్వ అభివృద్ధి



కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓరుగంటి దుర్గభవాని, అంగన్‌వాడీ భవన స్థలదాత కొప్పాకుల కార్తీక్, సీతమ్మ, పంచాయతీరాజ్ ఎఈ గోపి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## సమన్వయంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వర్షాకాల సన్నద్ధతపై మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యం, పురపాలక, విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మునిసిపల్ అధికారులు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వకుండా చూడాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నిత్యం ఫాగింగ్ చేపట్టాలన్నారు. విద్యుత్ అధికారులు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమత్తులు నిర్వహించాలన్నారు. ప్రధానంగా వైద్యారోగ్య శాఖ అధికారులు సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన సిబ్బంది, మెడిసిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ అధికారులు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ వ్యవస్థను మెరుగు పరుచుకోవాలన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డి, చెర్పర్సన్ చిలుకూరి సుద వెన్చెర్ పర్సన్ గుడిపాటి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు కాపుగల్లుకు చెందిన గుగ్గిళ్ల కరుణాకర్ 9 నెలల క్రితం మరణించారు. ఆయన తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కుటుంబ భరోసా పథకంలో సభ్యుడిగా ఉన్నారు. ఈ పథకం ద్వారా లభించిన రూ.1లక్ష 60వేల రూపాయల చెక్కును సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కుకుంట్ల లాలు చేతుల మీదుగా శుక్రవారం కోదాడ పట్టణంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు లాలు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ఫోటోగ్రాఫర్ల కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతోనే అసోసియేషన్ ఈ కుటుంబ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు చేపూరి లక్ష్మణ్, వర్మ, మరికంటి లక్ష్మణ్, జెమిని నరేష్, నగేష్, వనం సప్తగిరి, వత్సవాయి ఉపేందర్, వనం ప్రభాకర్, నరేష్, తమ్మర కోటేశ్వరరావు, శ్రీశంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి 4వ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ఆకాంక్షించారు. శుక్రవారం రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో బొడ్రాయి నాలుగో వార్షికోత్సవ సందర్భంగా బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలోని ప్రజలంతా బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని, ప్రజలు శాంతి సామరస్యాలతో వెలగాలని ఆకాంక్షించారు.శ్రీనివాస్ శర్మ అర్చకత్వం నిర్వహించారు. అనంతరం భక్తులకు పులిహోర, పాయసం ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి కుమార్, గ్రామ పెద్దలు మామిడి పద్మారెడ్డి, మాజీ సర్పంచులు కూనూరు రాములమ్మ రవికుమార్,కట్ట యాదయ్య, మామిండ్ల శేషాద్రి, ఉయ్యాల లక్ష్మి నర్సు, మన్నెం పద్మారెడ్డి, బూడిద నర్మద, శారద, నీల రజిత పాల్గొన్నారు.

